www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 22 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్



రితీష్‌రెడ్డితోనే టిడిపికి పూర్వ వైభవం

ప్రజాశక్తి-కలసపాడు

బద్వేల్ నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు ఇన్‌ఛార్జ్ రితీష్‌రెడ్డికే ఉన్నాయని నాయకులు కొత్తపల్లె స్వామిదాసురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రారంభం నుంచి పార్టీకోసం అహర్నిశలు కృషి చేస్తున్న కే.కే. విజయమ్మ కుటుంబానికి బద్వేల్ ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీని నడిపించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ నాయకులు మరవ పోరని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రితీష్‌రెడ్డి ఎప్పుడూ ముందున్నారని చెప్పారు. ఆయన వెంటే ప్రజలు, కార్యకర్తలు, ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. తాను సంపూర్ణ మద్దతు రితీష్ రెడ్డికి ఇస్తున్నట్లు తెలిపారు.

వైవీయూను మేటిగా నిలపడమే లక్ష్యం

- డిసెంబర్ 31లోపు కాన్వకేషన్ నిర్వహిస్తాం
- వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సరికొత్త ప్రణాళికలతో యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే మేటి యూనివర్సిటీగా, విద్యార్థులను అత్యున్నత మానవ వనరులుగా తయారు చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బోధన, పరిశోధన, ఉద్యోగ నైపుణ్యాలు ప్రాధాన్యత అంశాలుగా తీసుకున్నామని చెప్పారు. గతంలో తాను పనిచేసిన విశ్వవిద్యాలయం బెస్ట్ ప్రాక్టీసెస్ ఇక్కడ అమలు చేస్తామన్నారు. ఈ మూడేళ్లలో వరల్డ్ క్లాస్ యూనివర్సిటీ గా తయారు కావడానికి వ్యూహాలు రచిస్తున్నామన్నారు. మా విశ్వవిద్యాలయంలో 98 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారని అంతర్జాతీయ స్థాయిలో ఫోర్బ్స్ డాక్టరల్ ఫెలోషిప్‌లు కలిగి ఉండటం, 1700 పరిశోధన పత్రాలు స్కోపస్, వెబ్‌సైట్ వంటి ప్రామాణిక జర్నల్స్ లో పబ్లిష్ అవడం విశ్వవిద్యాలయ ప్రగతికి నిదర్శనమని చెప్పారు. భవిష్యత్తులో వీరు నిర్వహించే క్రియాశీలక పాత్రతో విశ్వవిద్యాలయం నంబర్ వన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2031 నాటికి సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్నామని చెప్పారు. 2027 వ సంవత్సరంలో నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్‌ఎఎసి)ఎ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించాలనే లక్ష్యంతో మేమంతా ఉన్నామన్నారు. రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో ఒకటి నుంచి 20 లోపు ర్యాంకుల్లో నిలిచేలా గట్టి ప్రయత్నం చేస్తామన్నారు. దూరవిద్యలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించనున్నామని, కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి స్టాండింగ్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌తో కలిసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ కృత్రిమజ్ఞానాన్ని అందరి విద్యార్థులకు అందేలా చూస్తామన్నారు. ప్రతి డిగ్రీ కళాశాలలో కెరీర్ కౌన్సిలింగ్ సెల్లు ఏర్పాటు చేసి ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తామని తెలిపారు. ఆలోచనలను విద్యార్థుల అవసరాలను, అసౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సజెషన్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ మాట్లాడుతూ విసి సారథ్యంలో విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రంథాలయ సమయ వేళలను పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిని వివరించారు. ఐక్యుఎసి డైరెక్టర్ డాక్టర్ ఎల్ సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ అనేక విద్యాసంస్థల్లో ప్రస్తుత విసి పనిచేసిన దృష్ట్యా ఆయన అనుభవం విశ్వవిద్యాలయ ప్రగతికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. డైలీ మానిటరింగ్ మెకానిజం ను అభివృద్ధి చేస్తున్నారని, యుద్ధ ప్రాతిపదికన విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతుం దన్నారు. ప్రజా సంబంధాల సంచాలకులు డాక్టర్ పి.సరిత విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ఎలక్ట్రానిక్ మీడియా చేస్తున్న కృషిని కొనియాడారు. సమావేశంలో వైవీయూ అడిషనల్ పబ్లిక్ రిలేషన్ సెల్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ బి. సురేష్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విసి ఆచార్య రాజశేఖర్

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రీజినల్ డైరెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న వివిధ సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ 143 వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులను మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేస్తూ దాదాపు మూడు వేల పర్యవేక్షక ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉందని తెలిపారు. జీతం ఒక్కచోట పని ఒకచోట చేస్తూ ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఎఎన్‌ఎంలకు జిఎన్‌ఎంలుగా శిక్షణ ఇచ్చి రెండు సంవత్సరంల అయినప్పటికీ వారికి ఎటువంటి ఉద్యోగోన్నతి కల్పించలేదని పేర్కొన్నారు. జిఒలోని అవకతవకలు కట్టడి చేయాలని, ఆర్‌డి కార్యాలయంలో ఉద్యోగోన్నతుల కోసం అన్ని కేడర్లకు సంబంధించిన సీనియారిటీ లిస్టును త్వరితగతిన విడుదల చేయాలని, వాటిలో ఉన్నటువంటి తప్పులను సరిచేయాలని కోరారు. ఎఎన్‌ఎంలకు మహిళ సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెండ్లికట్ల మల్లయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ కార్యదర్శి ఖాదర్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, భాస్కర్ యాదవ్, అనంతపురం, కర్నూలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు మక్బూల్ బాషా, జిల్లా మహిళా విభాగపు నాయకులు అచ్చమ్మ పాల్గొన్నారు. ధర్నా తదనంతరం రీజినల్ డైరెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. సమస్యలపై స్పందించిన డైరెక్టర్ తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ ఉన్నత అధికారులపరిధిలో ఉన్న వాటిని వారి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు యుటిఐ ఈక్విటీ ఫండ్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న చంద్రారెడ్డి

చిన్నారుల ఉన్నత విద్యకు, వివాహాది శుభకార్యాల కోసం యుటిఐలో ఉన్న చిల్డ్రన్స్ ఈక్విటీ ఫండ్ మంచి పథకమని యుటిఐ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ ఎ.వి.ఎస్.చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని గుంత బజార్‌లో ఉన్న యుటిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ప్రయాణంలో తమ పిల్లలు అనేక బహుమతులను గెలుచుకోవాలని, ఉన్నత చదువులను అభ్యసించాలని, ఉన్నత పదవులను అధిరోహించాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అత్యుత్తమ స్థాయిలో ఉంచాలని, డాక్టర్, ఇంజినీర్, పైలెట్, సైంటిస్ట్, లాయర్, సిఎ, బిజినెస్ ఇలా అనేక రంగాల్లో నైపుణ్యాన్ని సాధించి దేశ ఆర్థిక పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. అలాంటివారు తమ పిల్లల కోసం యుటిఐ ఈక్విటీ ఫండ్ పథకంలో మదుపు చేయాలని సూచించారు. ఇందులో పెట్టుబడులు పెట్టినవారు మంచి ఫలితాలను చూసి సంతృప్తి చెందారన్నారు. ఒకేసారి పెట్టుబడి పెట్టలేని వారికి ప్రతి నెలా పెట్టుబడి పెట్టే అవకాశం ఉందన్నారు. చిన్న పిల్లలకే కాకుండా పెద్దవారికి కూడా మంచి పథకాలు ఉన్నాయని వివరించారు. మూడు నెలలకు పింఛన్ పొందుటకు వీలుగా ఒకేసారి పెట్టుబడి పెట్టే విధానం కూడా ఉందన్నారు. నిజాయితీగా సంపదను అభివృద్ధి చేసి, తల ఎత్తుకుని జీవింప చేయడమే యుటిఐ లక్ష్యమన్నారు. పాన్, ఆధార్, ఫోటో, చెక్కుతో తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. తప్పనిసరిగా పథకాల ఆర్‌ఒఎం, ఒడి చదవాలని సూచించారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు పూర్తి వివరాలకు నగరంలోని తిరుమల హాస్పిటల్ సమీపంలో గుంత బజార్‌లో ఉన్న యుటిఐ మ్యూచువల్ ఫండ్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

డేటా ప్రాధాన్యత తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దైనందిన జీవితంలో ప్రతిదీ డేటాతోనే ముడిపడి ఉందని, దాని ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. నాల్గవ వరల్డ్ స్టాటిస్టికల్ డే సందర్భంగా మంగళవారం యోగివేమన యూనివర్సిటీ విసి కీలకోపన్యాసం చేశారు. గణాంకాలు సమాజానికి అద్దంలా పనిచేస్తాయని, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఊతంగా నిలుస్తాయని తెలిపారు. డేటా ప్రాధాన్యత, ఎలా ఉపయోగించాలి, ఎలా సద్వినియోగం చేసుకోవాలి, దాని మూల్యాంకనాన్ని చేసే విధానం, పరిరక్షణ సంబంధించి ఉదాహరణలతో అవగాహన కల్పించారు. రీసెర్చ్ స్కాలర్‌లు వారి పరిశోధనలలో స్టాటిస్టికల్ టూల్స్ ఉపయోగించడం వల్ల గణనలు సులభతరం చేయవచ్చన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ స్టాటిస్టిక్స్ సంబంధించిన టూల్స్‌ను క్షుణ్ణంగా నేర్చుకుని వాటికి సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులను చేస్తే మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందుతారని తెలిపారు. తనే స్వయంగా క్లాసులు తీసుకుని మరింత లోతైన అవగాహనను కల్పిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాస్, ఎఐఎస్ హెచ్చు నోడల్ ఆఫీసర్ ఆచార్య కాత్యాయిని సమావేశాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ హరినాథ్, యూనివర్సిటీ అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



గాయకులను సన్మానిస్తున్న కళాశాల కరస్పాండెంట్ గౌతమ్ కుమార్ రెడ్డి, గీతారెడ్డి

రామిరెడ్డి కళాశాలలో ఇండియన్ ఐడల్ పోటీలు

ప్రజాశక్తి - కడప

స్థానిక ఊటుకూరు ప్రకృతి నగర్‌లోని రామిరెడ్డి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో దేశంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఇండియన్ తెలుగు ఐడల్ పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు, ఆహా టీవీ శ్రేయాస్ మీడియా సహకారంతో పాటల పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అతిథులు పిఆర్‌ఆర్‌ఎం కళాశాల కరెస్పాండెంట్ పి. గౌతమ్ కుమార్ రెడ్డి, గీతరెడ్డి పాల్గొని గాయకులు పవన్ కల్యాణ్, సృష్టి , బృంద, ధీరజ్‌ను ఘనంగా సత్కరించారు. నలుగురు గాయకులు పోటాపోటీగా పాడరని, వీరికి మంచి భవిషత్తు ఉందని ప్రిన్సిపల్ నెల్సన్ కుమార్, యుగంధర్, గ్లోరి కొనియాడారు. కార్యక్రమంలో వంద పాటలు వరకు పాడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులు ఉత్సాహంగా కరతాళధ్వనుల మధ్య వర్షంలోనూ ఆడి పాడి సంతోషించారు.




ఈశ్వరయ్య ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా నాయకులు

ఈశ్వరయ్య ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఐ నూతన రాష్ట్ర కార్యదర్శిగా జి.ఈశ్వరయ్య ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడ దాసరి భవన్‌లో సిపిఐ జిల్లా నాయకత్వం కలిసి అభినందించారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, కె.రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సిపిఐ వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల కార్యదర్శులు గాలి చంద్ర, పి. మహేష్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. వల రాజు, కార్యవర్గ సభ్యులు బి రామయ్య, ఎల్ నాగసుబ్బారెడ్డి, వి.వీరశేఖర్ ఎన్.వెంకట శివ, పి చంద్రశేఖర్, పి.బాలు. పి. మస్తాన్, పి.వి. రమణ, నల్లిపోగు నాగేశం, పొంగూరు నాగరాజు ఉన్నారు. ఈశ్వరయ్య ఎన్నిక పట్ల టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు హర్షం వ్యక్తం చేశారు.



జెడ్‌ఎంఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న నిత్య పూజయ్య, సిబ్బంది

జోనల్ మలేరియా అధికారిగా నిర్మల్ అలెగ్జాండర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జోనల్ మలేరియా అధికారిగా నిర్మల్ అలెగ్జాండర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్‌ఎంఒకు ఎంపి హెచ్‌ఒ నిత్య పూజయ్య, కార్యాలయ సిబ్బంది హుస్సేన్, ఓబులేసు, మనోజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు.

ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప

ఇందిరా నగర్‌లోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ నర్సింగ్ తరపున వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు కంటి, చెవి, దంత, చర్మాలకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. తర్వాత పరిశుభ్రత, సమతుల్య ఆహారం తీసుకోవడం గురించి చక్కగా వివరించారు. అందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు భవిత రాణి, సువార్తమ్మ, ఎస్ఎంసి చైర్మన్ మెహ్రా, హెచ్.ఎం.మహబూబ్‌ఖాన్, ఉపాధ్యాయులు ఎం.డి.రఫీ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అజరామరం

జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి సత్యకుమారి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యకుమారి, ఎస్‌పి షెల్కే సచికేత్ విశ్వనాథ్

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్టలేనివని జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి సత్యకుమారి కొనియాడారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణాలు సైతం అర్పించారని, ప్రాణ త్యాగం చేసిన అమరులైన పోలీసులకు నివాళి అర్పించారు. ప్రజల క్షేమం కోసం త్యాగాలు చేసిన వారిని ఎప్పటికీ మరువలేమన్నారు. మంగళవారం నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించిన స్మృతి పెరేడ్‌కు ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో పాటు, జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి మాట్లాడుతూ పోలీసు యూనిఫార్మ్‌కు సమాజంలో అత్యంత గౌరవం ఉందన్నారు. పోలీసుశాఖలో విధులు సంక్లిష్టంగా ఉంటాయన్నారు. దేశానికి సైనికులు, పోలీసు వ్యవస్థ రెండు కళ్ళ వంటివని, అవి బాగున్నపుడే సమాజం సురక్షితంగా ఉంటాయని చెప్పారు. సైనికులు దేశ సరిహద్దుల్లో, పోలీసులు దేశంలోని అంతర్గత శాంతిభద్రతల సంరక్షణకై విధి నిర్వహణ చేస్తూ ప్రజలు ప్రశాంతంగా జీవించేలా కృషి చేస్తున్నారన్నారు. ఐటిబిపి, బిఎస్‌ఎఫ్ దళాలు ఏర్పాటు చేయకముందు పోలీసులే సరిహద్దుల వద్ద భద్రతను పర్యవేక్షించే వారని చెప్పారు. ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ అక్టోబర్ 21 న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, 1959, అక్టోబర్ 21 న లడఖ్‌లో హాట్ స్ప్రింగ్స్ వద్ద పది మంది సిఆర్‌పిఎఫ్ జవానులను అక్రమంగా భారత దేశ భూభాగంలోకి వచ్చిన చైనా దేశపు దళాలు బలిగొన్నాయని తెలిపారు. అమర వీరులైన వారి ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరమూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని వివరించారు. ప్రజలు సాధారణంగా ఆర్మీ, పారా మిలిటరీలలో అంతిమ త్యాగం ఉంటుందని అను కుంటారని, కానీ వాస్తవంగా పోలీసులే ఎక్కువ సంఖ్యలో అమరులవుతారని పేర్కొన్నారు. ప్రజలు కూడా లోతుగా అలోచించి పోలీస్ శాఖకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని ఎస్‌పి కోరారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం లో భాగంగా పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయా చిత్రాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ దగ్గరుండి ఒక్కో ఛాయా చిత్రంకు సంబం ధించి వివరాలను అదనపు న్యాయమూర్తికి విశదీకరించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, సామాగ్రి ప్రదర్శన 'ఓపెన్ హౌస్' ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందంలోని డయానా, రూబీ, లూసీ, జిమ్మీ, సోను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్‌పి జాగిలాల గురించి జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తికి వివరించారు. నేర పరిశోధనలో, విఐపి ల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, ఎ.ఆర్ డిఎస్‌పి నాగేశ్వర రావు, కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్, ప్రొద్దుటూరు డిఎస్‌పి పి.భావన, జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర రావు, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీమ్, మహిళా పిఎస్ డిఎస్‌పి బాలస్వామి రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, డిటిసి ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్ రెడ్డి, ఆర్‌ఐలు, నగరంలోని సిఐలు, ఎస్‌ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి

'సీమ' ప్రజల్లో చెరగని జ్ఞాపకం 'విద్వాన్ విశ్వం'

ప్రజాశక్తి - కడప అర్బన్

పెన్నేటి పాట కావ్యం ద్వారా రాయలసీమ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని ఏర్పరచుకున్న విద్వాన్ విశ్వం విద్వాంసులకే విద్వాంసుడని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం, కడపలో విద్వాన్ విశ్వం 111వ జయంతిని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట విశ్వం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్వాన్ విశ్వంగా ప్రసిద్ధులైన మీసరగండ విశ్వరూపాచారి ఆదర్శ రచయితగా, ఆధునిక కవిగా, పండితునిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, గొప్ప మానవతావాదిగా రాయలసీమ చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. కొందరి కవుల కావ్యాల్లో నడకను, మరికొందరి కవుల్లో ప్రాసను చూడవచ్చని చెప్పారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ విద్వాన్ విశ్వం రాసిన విరి కన్నె(కావ్యం), ఆత్మసాక్షి (కవిత్వం), ప్రేమించెను (నవల)తో పాటు 'ఒకనాడు, నా హృదయం' మొదలైన కావ్యాలను, వచన రచనలను, కాదంబరి, మేఘసందేశం, కిరాతార్జునీయం వంటి ఎన్నో సంస్కృత గ్రంథాలను అనువాదం చేశారన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ విశ్వం రాయలసీమ ఔన్నత్యాన్ని కీర్తిస్తూనే పెన్నా తీరం ఇసుక ఎడారి అయిందని, పీనుగలకి, నక్కలకి, గుడ్ల గూబలకి నివాసమైందని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. సీమలో నాటి పరిస్థితుల్ని పెన్నేటి పాటగా రాసిన తీరు ప్రతి ఒక్కరిని కదిలిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎ.సుబ్బరాయుడు, కోశాధికారి ఎన్.నగేష్, సత్యరాజు, నాగరత్నాచారి, సుభాన్ పాల్గొన్నారు.



జానమద్ది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ పద్మ

బహుభాషావేత్త 'జానమద్ది'

- వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పి. పద్మ

ప్రజాశక్తి- కడప అర్బన్

'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, అనేక కార్యక్రమాలు నిర్వహించి, సాహితీ పరిమళాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 101వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా సిపి బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కాంస్యవిగ్రహానికి, సమావేశమందిరంలోని జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ కడప నగరంలో సి.పి.బ్రౌన్ సాహిత్యయజ్ఞం జరిపిన ప్రదేశంలో మొట్టమొదటగా బ్రౌన్ స్మారక భవనాన్ని నిర్మించడం విశేషమన్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం తోడ్పాటుతో పలు నూతన కార్యక్రమాలను చేపట్టి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడతామన్నారు. హనుమచ్ఛాస్త్రి ఎందరో సాహితీవేత్తల నుండి అరుదైన అనేక గ్రంథాలు సేకరించి, బ్రౌన్ గ్రంథాలయాన్ని ఒక గొప్ప విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రికి తెలుగుతో పాటు కన్నడం, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉండడం వల్లనే ఆయన పలురకాల రచనలు చేయ గలిగారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం కోసం తన తండ్రి అహర్నిశలు శ్రమించారన్నారు. పాఠశాల విద్యార్థులు మొదలుకొని బస్తర్ ప్రాంతంలోని ఒక రిక్షా కార్మికుడు, ఎంతోమంది దాతలు ఇచ్చిన విరాళాలను సేకరించి గ్రంథాలయాన్ని నిలబెట్టారన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న లెక్కల జమాల్‌రెడ్డి

దీపావళి బోనాంజ అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎ ఉత్తర్వులు దారుణమని, డిఎ అరియర్స్ పొందాలంటే ఉద్యోగ విరమణ పొందాలి లేదా మరణించాలని అనే విధంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎపి పిఎస్‌టియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024, జనవరి 1 నుంచి 2025, సెప్టెంబర్ 30 వరకు రావాల్సిన డిఎ అరియర్లు సర్వీస్ నుంచి వైదొలిగే సమయంలో అంటే రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని, చనిపోయిన ఉద్యోగికి అయితే వారసులకు ఇస్తామని చెప్పడం దారుణమని చెప్పారు. ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి , రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.చిన్న రెడ్డన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సి వి గురువారెడ్డి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎస్. ఇలియాస్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ వెంటనే రద్దుచేసి కొత్త జిఒ ఇవ్వాలని లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. **డిఎ బకాయిల ఉత్తర్వులను సవరించాలి ..** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 60,61 ఉత్తర్వులను సవరించాలని ఆంధ్రప్రదేశ్ బహుజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల శివార్జున, సి.సుదర్శన్ బాబు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తొలిసారిగా డిఎ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కానీ ఉత్తర్వులో బకాయిలను సదరు ఉద్యోగి విరమణ సమయంలో చెల్లి స్తామని, ఒకవేళ ఉద్యోగి చనిపోతే వారి వారసులకు ఇస్తామని ఉత్తర్వులలో ప్రభుత్వం పొందుపరచడం దారుణమని పేర్కొన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు నగదు రూపంలో చెల్లించేలా ఉత్తర్వులు సవరించాలన్నారు.

'మాకు న్యాయం చేయండి'

ప్రజాశక్తి - కడప

బేడ బుడగ జంగం కులానికి చెందిన వారిని ఎస్‌సి జాబితాలో చేర్చి న్యాయం చేయాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక బేడ బుడగ జంగం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ బుడగ జంగాల పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ఎస్‌సి జాబితాలో చేర్చాలని తెలిపారు. బుడగ జంగాల వృద్ధులకు, వితంతలకు, వికలాంగులకు పింఛను, ప్రభుత్వ పథకాలకు కుల ధృవీకరణ పత్రాలు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం బుడగ జంగం కులానికి సెల్ఫ్ సర్టిఫికెట్ ద్వారా పథకాలు అందించేదని, ప్రస్తుత ప్రభుతమూ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కె.లక్ష్మయ్య, పి. ఆంజనేయులు, .వెంకటయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పస్తం అంజి

ఎస్‌పిని కలిసిన విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఆమెను జిల్లాలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్ పీర్, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరుబాషా పాల్గొన్నారు.



ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి



దెబ్బతిన్న కాలువను పరిశీలిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

దెబ్బతిన్న డ్రెయినేజీ కాలువ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని ఎత్తపువారి కాలనీ డ్రెయినేజీ కాలువపై పడిన రంధ్రాలను పూడ్చాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఆ కాలువను మంగళవారం డివైఎఫ్ఐ నామయకులు పరిశీలించారు. కాలువపై ఉన్న రంధ్రాలతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు డ్రెయినేజీ కాలువపై కప్పువేయాలని వేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య కోరారు. ముద్దనూరు రోడ్డు నుండి ఎత్తపువారి కాలానికి వెళ్లే దారిలో ప్రధాన రహదారిలో రోడ్డుకు మధ్యలో డ్రెయినేజీ కాలువపై రంధ్రం పడిందన్నారు. వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి, రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య చాలా కాలం నుండి ఉన్నా, ఎవరూ పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారన్నారు. కాలనీలో చాలా చోట్ల కుడా సమస్యలు ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువపై రంధ్రాలను పూడ్చి, ప్రజలకు సౌకర్యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, రాము పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో శానిటేషన్ కార్మికులకు నాలుగు నెలలు కావస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అప్పుచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారిపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 549 ప్రకారం రూ.16వేలు వేతన ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.11,800 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అడిగితే బెదిరించడం దుర్మార్గమన్నారు. పేదల వైద్యం కోసం, ఆరోగ్యాల కోసం ప్రభుత్వాసుపత్రిని నిత్యం శుభ్రంగా ఉండుతున్న తమకు ఇలాంటి పరిస్థితి రావడమేంటని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చాలా పరిశుభ్రంగా ఉంచే వీరికి ఇలాంటి పరిస్థితి రావడం దారుణమన్నారు. యాజమాన్యం జీతాలు ప్రతి నెల వేయకపోగా ఈఎస్ఐ, పీఎఫ్ అప్డేట్ చేయడం లేదన్నారు. ముఖ్యంగా వీక్లీ ఆఫ్‌లు, క్యాజువల్ సెలవులు ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. 100 పడకల ఆసుపత్రికి కేవలం 14 మంది మాత్రమే పనిచేయడం వల్ల కార్మికులకు అదనపు భారం పడుతోందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న వీరణాల శివకుమార్

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీలో అర్హులకు అన్యాయం

- పోస్టుల భర్తీపై సమగ్ర విచారణ జరపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎస్‌సిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీలో అర్హులకు అన్యాయం జరిగిందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనర్హులతో పోస్టులు భర్తీ అయ్యాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న హిస్టరీ, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేస్తున్నామని ప్రకటన ఇచ్చారు. ప్రధానంగా నెట్, పీహెచ్‌డి, టెట్, సెట్ అర్హతలు కలిగిన వారికి తగిన ప్రాధాన్యతస్తామని, పోస్టుల భర్తీలో కొన్ని వాటిని అనర్హులతో భర్తీ చేశారన్నారు. ఈ విషయాన్ని పలువురు నిరుద్యోగులు తమ దృష్టికి తెచ్చారన్నారు. నెట్, పీహెచ్‌డి ప్రధానమైన క్వాలిఫికేషన్ లేకున్నా పోస్టులు ఇచ్చారని అర్హత ఉన్న నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులను కలుస్తామని శివకుమార్ తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పర్యవేక్షణతోనే పరిశుభ్రత : కమిషనర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి

పర్యవేక్షణతోనే పరిశుభ్రత సాధ్యమని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వర్షంలోనే ఆయన కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు వర్షాకాలంలో అశ్రద్ధ వహించరాదన్నారు. దోమలు ప్రబలకుండా చూడాలని సూచించార. ఎప్పటికప్పుడు రోడ్లపై చెత్తను తొలగించి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్యం పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉందన్నారు. చిన్నపిల్లల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలు పడుతున్నప్పుడు రోడ్లపైకి పిల్లలను తీసుకురావద్దని సూచించారు. వర్షంలో కమిషనర్ పర్యటనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్యనాథ స్వామి ఆలయానికి ఫ్యాన్ వితరణ

ప్రజాశక్తి - చాపాడు

వల్లూరు మండలంలోని దక్షిణ పుష్పగిరి శ్రీవైద్యనాథ స్వామి ఆలయానికి మైదుకూరుకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్లు తిప్పిరెడ్డి జయనరసింహారెడ్డి, కూశెట్టి రమణయ్య ఫ్యాన్ వితరణ చేసినట్లు రచయిత బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రాథమిక అవసరాలు తీర్చడానికి, సహాయం చేశారన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్‌కు ఫ్యాన్ అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొమ్మిశెట్టి కృతిక రాయల్ పాల్గొన్నారు.



ఫ్యాన్‌ను అందజేస్తున్న బొమ్మిశెట్టి రమేష్, కృతిక

వర్షంతో మొక్కజొన్న రైతుకు కష్టాలు

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు బైపాస్‌లో వర్షం నుంచి మొక్కజొన్నను కాపాడుకునేందుకు పట్టలు కప్పిన రైతులు

తుపాన్ ప్రభావంతో మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న రైతులు కుదేలవుతుఆన్నరు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మొక్క జొన్న ప్రస్తుతం రైతులు నూర్పిడి చేసి ఆరబెడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఆగకుండా వర్షం పడుతోంది. వర్షాన్నుంచి మొక్కజొన్న విత్త నాలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి రోడ్లపై మొక్కజొన్న విత్తనాలను కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలతో వర్షానికి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. సోమవారం కొంతసేపు మాత్రమే వర్షం పడి ఆగింది. మంగళవారం మాత్రం అధికంగా వర్షం పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేపట్టిన రైతులు వర్షానికి విత్తనాలు దెబ్బ తిం టాయని దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట మాత్రం వర్షం వల్ల ఎలాంటి నష్టం ఉండదని పేర్కొంటున్నారు. ముం దస్తుగా వరి పంట సాగు చేసి నూర్పిడి చేపడుతున్న రైతులు మాత్రం ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చాపాడు మండల పరిధిలోని అయ్యవారిపల్లె, రామదాసుపురం, తిమ్మాయపల్లి గ్రామాల వద్ద వరి పంట నూర్పిడి పనులు చేపట్టారు. ఆగకుండా పడుతున్న వర్షానికి గ్రామా ల్లో రోడ్లన్నీ బురదమయ మయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందికరంగా తయారైంది. వర్షం రెండుమూడు రోజులపాటు ఆగ కుండా పడితే తీవ్ర నష్టం వాటి ల్లుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉల్లి రైతుల పరిస్థితి కూడా అగ మ్యగోచరంగా తయారైంది. ధరలు లేక పోవడంతో రైతులు చాలావరకు నూ ర్పిడి చేయకుండా ఉల్లిగడ్డలను అలానే పొలంలో ఉంచారు. ప్రస్తుత వర్షానికి ఉల్లిగడ్డలు కుళ్లి దెబ్బ తింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మిన ఎరువులకు రసీదు తప్పక ఇవ్వాలి



ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఎడి, ఎఎ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఎరువులు అమ్మిన వెంటనే ఆ రైతుకు వెంటనే రసీదు తప్పక ఇవ్వాలని మైదుకూరు వ్యవసాయ సంచాలకులు కృష్ణమూర్తి సూచించారు. మైదుకూరు ఎఎ బాలగంగాధర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ యూరియా ఎంఆర్‌పికే విక్రయించాలన్నారు. యూరియా అమ్మకాలను ఇతర ఎరువులను ముడి పెట్టకూడదన్నారు. స్టాక్, కొనుగోలు, అమ్మకాల రిజిస్టర్లు, రైతులకు ఇచ్చిన రసీదులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి, తనిఖీ అధికారులకు అందుబాటులో ఉంచాలని దుకాణ యజమానులకు సూచించారు. ఇపాస్ యంత్రంలో ఉన్న స్టాక్, భౌతిక స్టాక్ కచ్చితంగా సరిపోవాలన్నారు. యూరియా ఇతర ఎరువుల అమ్మకాలలో బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయం, లేదా ఏవైనా అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరూ యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని, అవసరం మేరకు ఉందన్నారు. తనిఖీల్లో భాగంగా శ్రీ సాయి లక్ష్మి ఫర్టిలైజర్స్, సద్గురు సాయి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీనివాస ట్రేడర్స్, లక్ష్మీ వెంకటేశ్వర దుకాణాలను ఆయన పరిశీలించారు.

ప్రొద్దుటూరు కేంద్రంగా అసాంఘిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు కేంద్రంగా అసాంఘిక కార్యక్రమాలు సాగుతున్నాయని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమైన నాయకుల అండదండలతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అతని కుమారుడు కొండారెడ్డి, వారికి సంబంధించిన కొన్నిల్లు నూతన ఒరవడితో క్యాసినో జూదం కూడా ఆడిస్తున్నారన్నారు. ధనవంతులైన వ్యాపారస్తుల పిల్లలు ప్రొద్దుటూరు నుంచి గోవాకు రూ.లక్షల ఖర్చుతో అక్కడ అన్ని సౌకర్యాలను అనుభవిస్తూ మత్తుకు, చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసాంఘిక కార్యక్రమమైన క్యాసినో జూదం సంవత్సరం నుంచి ప్రొద్దుటూరు కేంద్రంగా జరుగుతోందన్నారు. స్థానిక పోలీసులు నియంత్రించే సామర్థ్యం ఉండి కూడా రాజకీయ వ్యవస్థతో ఏమీ చేయలేక పోతున్నారన్నారు. రాజకీయ వ్యవస్థ పోలీసుల చేతులు కట్టేసిందన్నారు. యువశక్తి నిర్వీర్యమై పోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ అధి కారంలోకి వచ్చాక బంగాకు విచ్చలవిడిగా దొరుకుతుందన్నారు. బియ్యం అక్రమ రవాణాకు ప్రొద్దుటూరు కేంద్రంగా ఉందన్నారు. 5,3 వార్డుల కౌన్సిలర్లు అసాంఘిక కార్యక్రమాలు నడుపుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా సాగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్నారు. నకిలీ మద్యం ఏరులై పారుతోందన్నారు. ప్రొద్దుటూరు చుట్టు పక్కల పది ప్రదేశాల్లో జూదం విచ్చలవిడిగా సాగుతుందని ఆయన ఆరోపించారు. జిల్లా పోలీసు అధికారి అనుమతిస్తే ఈ అసాంఘిక కార్యక్రమాల గురించి స్వయంగా వివరిస్తానని రాచమల్లు తెలిపారు. ఇవన్నీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆయన కుమారుడు కొండారెడ్డి అండదండలతోనే సాగుతున్నాయని ఆరోపించారు. వరదరాజులరెడ్డి మాత్రం అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. వీరు చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పోలీసు అధికారులపై నెపం మోపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నత అధికారి ఈ అసాంఘిక కార్యక్రమాలను నియంత్రించాలని రాచమల్లు కోరారు.

మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

కంది,జొన్న,శనగ పంటల్లో నీరు నిల్వలేకుండా మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బొందలకుంట గ్రామంలో కంది, జొన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ కంది, జొన్న, శనగ పంటల్లో రసం పీల్చే పురుగు ఉధృతి నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాని సూచించారు. వర్షాభావ ప్రభావం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. నివారణకు ఎకరాకు 8 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను అడుగు ఎత్తులో కర్రలకు అమర్చుకోవాలన్నారు. వేప నూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈనెల 25లోపు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన 'సింగం'

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్లో పెట్టడానికి పోలీసులకు తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామని ఎస్‌పికి తెలిపారు.

సమాజసేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో భాగంగా 6వరోజు మంగళవారం తాళ్లమాపురం గ్రామంలో సమాజసేవ చేశారు. ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. సచివాలయ ఇన్‌ఛార్జి సెక్రెటరీ విజయరాజు భాగస్వామ్యంతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రతివీధి తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, సచివాలయ డంపింగ్‌కు అందించారు. మధ్యాహ్న కార్యక్రమంలో భాగంగా జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అంశానికి సంబంధించి కళాశాల జిఎస్‌టి అధ్యాపకులు హుస్సేన్ స్థానిక పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పలు విషయాలను వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, అధ్యాపకులు, స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 11, 13, 14, 15 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఏడురోజుల పాటు కుమ్మరాంపల్లె, తాళ్లపల్లె, కొండవాండ్లపల్లె, కుమార కాల్వ గ్రామాల్లో స్వచ్ఛ భారత్, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, గ్రామ పురవీధుల్లో చెత్త చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామ ప్రజల్లో పరిశుభ్రతపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. యూనిట్ 13 ప్రోగ్రాం ఆఫీసర్ అమరేంద్ర కుమార్ సూచనల మేరకు కో-ఆర్డినేటర్స్ దీప్తి, ప్రసాద్ బృందం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు దీప్తి, తిరుపతిరెడ్డి, గోవర్ధన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి స్వామి వివేకానంద విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె



ఎంపికైన విద్యార్థులతో రామాంజనేయరెడ్డి

ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు వేంపల్లెకు చెందిన స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. పులివెందులలో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో వివేకానంద పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు తెలిపారు. మండలస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చాటడడంతో జిల్లాస్థాయికి ఆయా కేటగిరీల వారీగా ఎంపికయ్యారని తెలిపారు. ఖోఖో క్రీడల్లో సీనియర్స్ విభాగంలో ఎం.దేవేంద్రరెడ్డి, ఫైరోజ్, జయప్రసాద్ రెడ్డి, మహేష్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, లోహిత్ కుమార్‌రెడ్డి ఎంపికైనట్లు పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో ప్రశాంత్ కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్ కొండారెడ్డి, భరణి కుమార్‌రెడ్డి, జగదీష్ ఎంపికయ్యారని తెలిపారు. యోగా విభాగంలో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. కబడ్డి సీనియర్స్ జట్టుకు జగదీశ్వర్‌రెడ్డి, జూనియర్స్ జట్టుకు గోవర్ధన్‌రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. చెస్ విభాగంలో రుద్రమూర్తి రెడ్డి ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో 15 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపిక కావడం పట్ల పిఇటి పద్మజను కరస్పాండెంట్ అభినందించారు.



విద్యారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి


ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదేశించారు. పులివెందుల జెఎన్‌టియు కళాశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి అన్నం తిన్నారు. ఆహారం నాణ్యత లోపాలను ఆయన గుర్తించి వాటిని సరి చేయాలని కళాశాల ప్రిన్సిపల్, మెస్ ఇన్‌ఛార్జికి సూచించారు. వంటగది, టాయిలెట్, తాగునీరు, వసతి గదులను పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా, ఆహార పదార్థాల నాణ్యత ఏ విధంగా ఉందనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాల విషయంలో ఎలాంటి అలసత్వం, నాణ్యతాలోపం ఉన్నా సహించేది లేదని ఎమ్మెల్సీ హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కె.శేష మహేశ్వరమ్మ, మెస్ మేనేజర్ జి.మురళి అన్ని విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కార్పొరేషన్ చైర్మన్ దృష్టి పెట్టాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ ప్రసాదరావు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు రఘునాథరావు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. కార్పొరేషన్ ఏర్పాటుతో బ్రాహ్మణులకు మేలు జరుగుతుందని సంతోషపడ్డామన్నారు. 2019లో ఆ ఆశలు నిరాశను మిగిల్చాయన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మణుల్లో మళ్లీ ఆశలు మొలకెత్తాయన్నారు. వాటిని నిజం చేసే బాధ్యత కార్పొరేషన్ చైర్మన్‌దే అన్నారు. గరుడ పథకం జూన్ 2024 నుండి ఇస్తామని చైర్మన్ హామీ ఇచ్చారని చెప్పారు. రెండేళ్లుగా వెబ్‌సైట్ పని చేయలేదని తెలిపారు. వెంటనే ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభించి పథకాలకు దరఖాస్తులు చేసుకొనే అవకాశం కల్పించాలని వారు కోరారు. క్రెడిట్ సొసైటీలో పథకాలు మంజూరు చేయాలన్నారు. సభ్యత్వ నమోదు పెంచడానికి చర్యలు ప్రారంభించాలని సూచించారు. మెడిసిన్ విద్యను త్వరితగతిన పేద ప్రజలకు అందుబాటులోకి తీసుక రావడానికి పిపిపి విధానం మంచిదన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి తోడ్పాటుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.



చెరువులో విహరిస్తున్న స్వదేశీ పక్షులు

రావులపల్లె చెరువులో స్వదేశీ పక్షుల సంచారం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని రావులపల్లె చెరువులో స్వదేశీ తెల్ల, నల్ల కొంగలతో పర్యాటక ప్రదేశాన్ని తలపిస్తోందని మైదుకూరుకు చెందిన చరిత్రకారుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరడంతో ఈ స్వదేశీ తెల్ల, నల్ల కొంగలు ఆవాసం, ఆహార సముపార్జన, సంతానోత్పత్తి కోసం ఈ ప్రాంతానికి చేరాయని తెలిపారు. చెరువులో ఉన్న చేపలను ఈ కొంగలు ఆహారంగా తీసుకుంటాయని, సమీప పంట పొలాల్లోని కీటకాలను తిని రైతు నేస్తాలుగా కొనసాగుతాయన్నారు. చెరువులోని మొక్కలపై ఆవాసం ఏర్పర చుకున్నాయని పేర్కొన్నారు. నల్ల పక్షి శాస్త్రీయ నామం కార్పోరాంట్స్ అని, (చెరువులోని కంపచెట్లు నల్ల తుమ్మ) శాస్త్రీయ నామం అకేసియా నీలోటికా అని ప్రొద్దుటూరు డివిజన్ అటవీ అధికారి హిమంజలి చెప్పారని అన్నారు. పోరుమామిళ్ల బద్వేలు ప్రాంతాల్లో వెదుళ్లపల్లి ప్రాంతంలో విదేశీ పక్షులు సంచరిస్తుండగా, రావులపల్లె చెరువులో స్వదేశీ పక్షులు విహరిస్తున్నాయని ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

పగలే మసీదులో దొంగతనం

ప్రజాశక్తి - తొండూరు

మల్లేలలో మంగళవారం మధ్యాహ్నం దుండగులు పట్టపగలే మసీదులో చోరీకి పాల్పడ్డారు. ఎవరూలేని సమయంలో మసీదులోకి చొరబడి దాదాపు రూ.30వేలు నగదును అపహరించారు. స్థానికులు వెంటనే స్పందించి నిందితులను వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు. గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.